ఇంటికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది అతని పొలం. నున్నటి తార్రోడ్డు మీద బుల్లెట్ దూసుకుపోతున్నది. అటూఇటూ చెట్లతో రోడ్డంతా నీడ పరుచుకుంది. ఓచోట పుంతలోకి బండి టర్న్ చేశాడు అనంతం. ఐదొందల మీటర్లు దాటేక వచ్చిందా పొలం. పొలం అనే కంటే.. దాన్నో వనం అనాలేమో.

ఆరుమడులూ కలిపి మూడెకరాలు. ఓ మడిలో మామిడిచెట్లు పంచాయితీలో పెద్దమనుషుల్లా గంభీరంగా ఉన్నాయి. మధ్యలో వేసిన జనుమునార పచ్చని పువ్వులతో 'ఆమ్స్టర్ డ్యామ్'ని తలపిస్తున్నది ఆ చంటోడికి. మరో మళ్లో వరుసగా వేసిన కొబ్బరిచెట్లు సరిహద్దు సైనికుల్లా క్రమశిక్షణతో ఊగుతున్నాయి. అంతరపంటగా వేసిన మినుములు మిలటరీ ట్యాంకుల్లా మౌనంగా బలపడుతున్నాయి.

ఇంకో మళ్లో అప్పుడే వేసిన రకరకాల కూరగాయల మొక్కలు, పాదులు.. ఎల్కేజీ పిల్లల డ్రిల్లులా గాలికి అటూఇటూ ఊగుతున్నాయి. మిగిలిన మడులు అరటి పిలకలతో అట్లబంతిలో కూర్చున్న ఆడపిల్లల్లా సుకుమారంగా ముచ్చటగా ఉన్నాయి. దూరంగా బోరు శబ్దం చేస్తూ, నీరు సన్నటి కాలవ ద్వారా పారుతున్నది.

బుల్లెట్ శబ్దం వినిపించగానే గట్లు సరిచేస్తున్న పోలయ్య పరిగెత్తుకుని వచ్చాడు.

వద్దన్నా వినకుండా అనంతంతోబాటే చంటాడు కూడా మడిలోకి దిగాడు. కాసేపు నీళ్లలో ఆడాడు. షూ తడిసిపోవడంతో విప్పేశాడు. కుండీలో తాబేళ్లతో కాసేపు ఆడుకున్నాడు. పోలయ్య కొట్టిచ్చిన కొబ్బరిబొండం తాత చూపించినట్టుగా ఎత్తిపెట్టి తాగడానికి ప్రయత్నించి.. చొక్కా మొత్తం తడుపుకొన్నాడు. కడుక్కునే సాకుతో బోరు ఎదురుగా నిలబడి కాసేపు వళ్లు తడిసేలా ఆడాడు.

''ఇంక చాలు నాన్నా.. వెళ్లిపోదాం పద!'' అనగానే, అడుగులో అడుగేస్తూ వస్తున్న వాడల్లా దుక్కి దున్నిన నేల కావడంతో తూలి పడబోయి.. కోతులు చొరబడకుండా వేసిన ఉన్న ముళ్లకంచె మీద కాలేశాడు. లేత పాదంలో తుమ్మముల్లు కస్సుమని దిగింది.

''అమ్మా'' అంటూ కూలబడ్డాడు.

వెంటనే పోలయ్య పిల్లాణ్ని ఎత్తుకుని గట్టుమీదున్న నులకమంచం మీద కూర్చోబెట్టి, నెమ్మదిగా ముల్లు తియ్యసాగాడు. పిల్లాడు ఏడుస్తున్నాడు. ఒక్కక్షణం కంగారు పడినా.. అనంతం వెంటనే తేరుకుని, పిల్లాణ్ని కదలకుండా పట్టుకున్నాడు. ఒడుపుగా ముల్లు తియ్యగానే రక్తం ఎగచిమ్మింది. జేబులో ఉన్న కర్చీఫ్ని నీళ్లలో ముంచి పిండి, రక్తాన్ని తుడుస్తున్నాడు. యుద్ధంలో నెత్తురు పారించిన అతనికి ఆ క్షణం చాలా కంగారుగా ఉంది. కోడలికి విషయం తెలిస్తే చాలా రభస అవుతుంది. ఓ అయిదు నిమిషాల్లో అంతా సర్దుకుంటుంది. నొప్పి తగ్గాక 'అమ్మకి చెప్పొద్దని మనవడికి చెప్పాలి' అనుకుని, వాడికి తగ్గాక బయల్దేరదామని వెయిట్ చేస్తున్నాడు. అంతలో మొత్తం కర్చీఫ్ రక్తంతో తడిసిపోయింది. పోలయ్య తలకి చుట్టుకున్న టవల్ తీసుకుని తడిపి, పిండి.. దాంతో తుడవడం మొదలుపెట్టాడు. మరో పది నిమిషాలు గడిచింది. ఎర్రటి పిల్లాడు పాలిపోసాగాడు. పాదం ఇంకా రక్తం చిమ్ముతూనే ఉంది. పోలయ్య బెదిరిపోయాడు.

అనంతానికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. డాక్టర్ సూర్యారావుకు ఫోన్ చేశాడు. అతను మొత్తం విషయం తెలుసుకుని..

''వెంటనే తీసుకురండి. అవసరమైతే రక్తం ఎక్కించాలి. బ్లడ్ బ్యాంకు నుంచి ప్లాస్మా తెప్పించి ఉంచుతాను. వాళ్లకి నీ నెంబర్ ఇస్తాను. ఓ ఇద్దరు వెళ్లి, చెరో యూనిట్ బ్లడ్ రీస్టోర్ చేస్తే సరిపోతుంది'' అన్నాడు.

కోడలితో మాట్లాడటానికి ధైర్యం చాలక, కొడుక్కి ఫోన్ చేసి విషయం చెప్పి నేరుగా హాస్పిటల్కి రమ్మన్నాడు. పోలయ్య పిల్లాణ్ని ఎత్తుకుని బండి వెనకాల కూర్చుంటే.. నేరుగా హాస్పిటల్కి బయల్దేరాడు అనంతం. దారి పొడుక్కీ రక్తం చిమ్ముతూనే ఉంది. అనంతం జీవితంలో మొదటిసారి భయపడ్డాడు.

* * *

అనంతం హాస్పిటల్కి చేరుకునే సరికి అప్పటికే కొడుకు, కోడలు అక్కడున్నారు. అనంతాన్ని చూస్తూనే




'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.